## క్లుప్తంగా

### ఆశ కార్యకర్తల ఆందోళన



ధర్నా నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తలు

**ఇల్లెందు:** పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశ వర్కర్లకు వేతనం రూ.18 వేలు చెల్లించాలని, అదనపు పనులు చేయించొద్దని, టీబీ, లెప్రసీ, కంటివెలుగు తదితర పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆశ వర్కర్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే హరిప్రియకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్ఏ నబీ, ఆశ వర్కర్లు ఉమాదేవి, హైమావతి, నజ్మా, రేణుక, రత్నకుమారి, సునీత, కరుణ, అరుణ, లత, విమల, లక్ష్మి, సుగుణ, సుజాత, రమా, కళావతి, ఆదిలక్ష్మి, విజయలక్ష్మి, వెంకటరమణ, పుష్పావతి, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

### పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

**జూలూరుపాడు:** ఆసరా పెన్షన్ పొందుతూ భర్త చనిపోతే వితంతు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. భర్త చనిపోయిన వితంతువులు మండలవ్యాప్తంగా 160 మంది ఉన్నారని, వారంతా బుధవారం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. భర్త డెత్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లను దరఖాస్తుకు జతచేసి, గ్రామ పంచాయతీ సెక్రటరీ, లేదా మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న 20 మంది వితంతువులకు పెన్షన్ మంజూరైందని, త్వరలోనే వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ అవుతుందని వెల్లడించారు. గృహలక్ష్మి పథకానికి 3,399 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 1,373 మంది ఎస్టీ మహిళలు అర్హులు కాగా, 1,340 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశామని ఎంపీడీఓ వివరించారు.

### కిన్నెర మండల సమాఖ్య ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

**పాల్వంచరూరల్:** స్థానిక ఐకేపీ కార్యాలయంలో మంగళవారం నూతన కిన్నెర మండల సమాఖ్యను ఎన్నుకున్నారు. మండలంలోని 842 స్వయం సహాయక సంఘాలు, 48 గ్రామ సమాఖ్యలకు చెందిన మహిళలు ఏడాది పాటు పదవీకాలం నిర్వహించనున్న ఈ సమాఖ్య అధ్యక్షురాలిగా కుమారి (పుల్లాయిగూడెం), కార్యదర్శిగా లక్ష్మీదేవి (దంతలబోరు ఎస్సీకాలనీ), ఉపాధ్యక్షురాలిగా సుమతి (ఉల్వనూరు కొత్తూరు), కోశాధికారిగా చుక్కమ్మ (పునుకుల), సహాయ కార్యదర్శిగా జె.భద్రి (తోగ్గూడెం తండా)ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రాంబాబుతోపాటు సుభాష్, పి.మురళీకృష్ణ, శ్రీను, రవికుమార్, పద్మావతి, నాగరత్నం పాల్గొన్నారు.

### 23 నెలల ఏరియర్స్ చెల్లించాలి

**సింగరేణి(కొత్తగూడెం):** సింగరేణి కార్మికులకు 11వ వేతన ఒప్పందం ప్రకారం 23 నెలల ఏరియర్స్ వెంటనే చెల్లించాలని బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవనాయక్ కోరారు. మంగళవారం ఆయన సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, జీఎం బి.హన్మంతరావుకు వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. వేతన సవరణ ఒప్పందం జూన్ నుంచి అమల్లోకి రాగా, 23 నెలల ఏరియర్స్ ఒకేసారి చెల్లించేందుకు అంగీకరించిన యజమాన్యం ఇప్పుడు జాప్యం చేస్తోందని తెలిపారు. ఇకనైనా కార్మికులకు వెంటనే ఏరియర్స్ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు టీఎస్ పవన్‌కుమార్, ప్రభాకర్‌రావు, జీవీ కృష్ణారెడ్డి, ఊట్ల గణేశ్, బి.రాంసింగ్, కాసర్ల మోహన్, మన్యంపల్లి మోహన్, బి.సుందర్‌రావు, పి.ఉమామహేశ్వరరావు, యాకుబుద్దీన్, మొగిలిపాక నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

### కెపాసిటర్లు అమర్చుకోవాలి

**జూలూరుపాడు:** వ్యవసాయ మోటార్లకు రైతులు కెపాసిటర్లను అమర్చుకోవాలని ఎన్పీడీసీఎల్ జూలూరుపాడు ఏఈ సతీశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలు కురవకపోవడంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, వ్యవసాయ రంగానికి విద్యుత్ వినియోగం పెరిగిందని, వ్యవసాయ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై ఓవర్‌లోడ్ పడి కాలిపోతున్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్ బిగించుకోవాలని రైతులను కోరారు.

# ఏళ్లుగా పోస్టులు ఖాళీ..

- మండలంలో 14 అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీ ఎప్పుడో?
- ఆయా పోస్టులదీ అదే పరిస్థితి
- పదేళ్లుగా నియామకాలు లేక ఇక్కట్లు



దంతలబోరు ఎస్సీకాలనీ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం

**పాల్వంచరూరల్:** అనేక సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక దశలో చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన అంగన్‌వాడీ టీచర్ పోస్టులు పదేళ్లుగా ఖాళీగా ఉంటున్నాయి. ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలంలో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు 52 ఉండగా అందులో 14 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడు పోస్టులు, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 23 (ప్రస్తుతం వాటిని కూడా మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయించింది) ఉండగా ఇందులో ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రేపల్లెవాడ, నారాయణరావుపేట, రెడ్డిగూడెం, బండ్రుగొండ, దంతలబోరు, సంగం, గొల్లగూడెం గ్రామాల్లో మెయిన్ సెంటర్లు, రాళ్లచెలక, తిరకలపాడు, పూసలతండా, సీతారాంపురం, ఎర్రబోరు, కోయ్యగట్టు, రెడ్డిగూడెం గ్రామాల్లో మినీకేంద్రాలలో పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. ఇక బండ్రుగొండ, సంగం, గంగదేవిగుప్ప, సోములగూడెంలోని కేంద్రాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

**గిరిజన అభ్యర్థులు లేక..**

ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేస్తే మండల పరిధిలో 150 మందికి పైగా దరఖాస్తులు చేసుకున్నా నేటికీ ఇంటర్వ్యూలు నిర్వహించలేదు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో అంగన్‌వాడీ టీచర్ పోస్టులను గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాల్సి ఉంటుంది. కానీ, అర్హులైన గిరిజన అభ్యర్థులు లేని కారణంగా టీచర్ పోస్టులు మండలంలో భర్తీ కావడం లేదని ఐసీడీఎస్ అధికారులు అంటున్నారు. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇన్‌చార్జ్ టీచర్లను నియమించకపోడం వల్ల అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే విద్యార్థులు కేవలం పౌష్టికాహారం మాత్రమే తీసుకుంటున్నారు.

#### టీచర్‌ను నియమించాలి



రెడ్డిగూడెం గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు గతంలో పలుమార్లు ఆందోళన చేశారు. ఇక్కడ ఉన్న అంగన్‌వాడీ టీచర్‌ను పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లికి గతేడాది పంపారు. దీంతో ఇక్కడ పోస్టు ఖాళీగా ఉండటంతో ఆయా వచ్చి విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తోంది.

–నాగిరెడ్డి, రెడ్డిగూడెం

#### ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయాలి



ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దంతలబోరు ఎస్సీకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ లేకపోవడంతో నేనే ఒక టీచర్‌ను నియమించి మూడేళ్లుగా వేతనం ఇస్తున్నా. విద్యార్థులు కేవలం పౌష్టికాహారానికి మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్నారు.

–గద్దల రమేశ్, సర్పంచ్, దంతలబోరు ఎస్సీకాలనీ

#### త్వరలోనే టీచర్ పోస్టుల భర్తీ



మండలంలో ఏడు మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడు టీచర్ పోస్టులు, ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని ప్రభుత్వం ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. ఏజెన్సీ మండలంలో గిరిజన అభ్యర్థులు మాత్రమే అర్హులు. మండలంలో అనేక గ్రామాల్లో గిరిజన టీచర్లు లేరు.కొత్తగా వచ్చిన జీఓ ప్రకారం తర్వలో ఖాళీ పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉంది.

–కనకదుర్గ, సీడీపీఓ

# పేదల జీవితాల్లో వెలుగులు..

- వారి దీవెనలతో ముందుకెళ్తాం..
- ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా

**కొత్తగూడెంఅర్బన్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు, మంజూరు చేస్తున్న నిధులతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని, వారి దీవెనలతో ముందుకు వెళ్తామని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని బూడిదగడ్డ, పాత కొత్తగూడెం, గౌతమ్‌నగర్, సుతారిబస్తీ, గంగహుస్సేన్‌బస్తీ, ప్యూన్‌బస్తీలను సందర్శించి సుమారు రూ.5 కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమా మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను దశలవారీగా నెరవేరుస్తున్నానని, తెలంగాణ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. కేసీఆర్ పార్టీ టికెట్ ఇచ్చారని, తిరిగి తనను ఆశీర్వదించి, గెలిపించాలని కోరారు. మాయమాటలు చెప్పి డబ్బు సంచులతో దిగుమతి అయ్యేవారికి బుద్ధి చెప్పాలని, కొత్తగూడెంలో ఏం అభివృద్ధి చేశారో, ఎన్నికల్లో నిలబడే వారు శ్వేతపత్రం విడుదల చేసి, పోటీ చేయాలని సవాల్ విసిరారు. పట్టణ ప్రజలకు 24 కిలోమీటర్ల దూరంలో ఉన్న కిన్నెరసాని జలాలను అందిస్తున్న ఘనత తనదేనన్నారు. ముర్రేడు, రైల్వే అండర్, గోధుమవాగు, పెనుబల్లి బ్రిడ్జిలను తానే కట్టించానని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో వనమా రాఘవేంద్రరావు, కాపు సీతాలక్ష్మి, భూక్యా రాంబాబు, బత్తుల వీరయ్య, కాసుల వెంకట్, ఎంఏ రజాక్, విజయ్, పరమేశ్‌యాదవ్, సుజాత, కోలాపురి ధర్మరాజు, పల్లపు లక్ష్మణ్, అంబుల వేణు, బండి నరసింహ, వేముల ప్రసాద్, దూడల బుచ్చయ్య, జక్కుల సుందర్, మసూద్, సుందర్‌రాజు, మాదా శ్రీరాములు, కూరపాటి సుధాకర్, యాకుబ్, కొట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### ఆదివాసీకే కేటాయించాలి

**జూలూరుపాడు:** వైరా ఎమ్మెల్యే స్థానాన్ని ఆదివాసీలకు కేటాయించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తెల్లం నరసింహారావు అన్ని రాజకీయ పక్షాలను కోరారు. మంగళవారం మండలంలోని గుండ్లరేవు గ్రామంలో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. వైరా నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి అన్ని రాజకీయ పార్టీలు లంబాడాలకే కేటాయించారని, ఈ దఫా ఆదివాసీలకు ఇవ్వాలన్నారు. మూడు దఫాలుగా ఎమ్మెల్యేలుగా గెలిచినా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని, ఆదివాసీలతోపాటు గిరిజ నేతరులు మార్పు కోరుకుంటున్నట్లు చెప్పారు.

### న్యాయవాది మృతికి సంతాపం

**కొత్తగూడెంటౌన్:** కొత్తగూడెంలోని రామవరానికి చెందిన న్యాయవాది అనుమకొండ శిధర్ మరణం తీరని లోటని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్‌కుమార్ మక్కడ్ అన్నారు. మంగళవారం ఏర్పాటుచేసిన సంతాప సభలో న్యాయవాదులు మౌనం పాటించగా, రమేశ్‌కుమార్ మాట్లాడారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రావిలాల రామారావుతోపాటు కాసాని రమేశ్, యాసా యుగేందర్, తోట మల్లేశ్వరరావు, పిట్టల రామారావు, వి.పురుషోత్తం, వి.నాగిరెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

### బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్

**కొత్తగూడెంటౌన్:** పట్టణంలోని పలు పోలీస్ స్టేషన్లలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో మంగళవారం రక్షాబంధన్ నిర్వహించారు. కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బ్రహ్మకుమారి సమాజ్ కొత్తగూడెం బ్రాంచ్ ఇన్‌చార్జ్ ఈశ్వరీయా ఆధ్వర్యంలో పోలీసులకు రాఖీ కట్టారు. వన్‌టౌన్ సీఐ కరుణాకర్, టూటౌన్ సీఐ రమేశ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 1న చలో హైదరాబాద్


మాట్లాడుతున్న యూఎస్‌పీసీ నాయకులు

**టేకులపల్లి:** ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సెప్టెంబర్ 1న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జరిగే మహాధర్నాకు అధిక సంఖ్యలో తరలిరావాలని యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ జిల్లా బాధ్యులు జి.హరిలాల్నాయక్, బి.కిశోర్‌సింగ్ పిలుపునిచ్చారు. మంగళవారం టేకులపల్లిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను మంగళవారం వారు కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. పీఆర్సీ నియామకం, ఐఆర్ ప్రకటన, బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల, సీపీఎస్ రద్దు తదితర డిమాండ్ల సాధనకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు చేపడుతున్న ధర్నాకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో వీరన్న, ఫాల్గుణ, మధుసూదన్‌రావు, భరత్, సురేశ్ పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం


సింగరేణి (కొత్తగూడెం): విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన


పాల్వంచరూరల్: గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు


ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోలారపు పద్మ

**సింగరేణి ఉన్నత పాఠశాలలో..**

**సింగరేణి(కొత్తగూడెం):** స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు వెంకటరామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ క్రీడా దినోత్సవం కూడా కావడంతో విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జి.ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు సీర ప్రసన్న, స్వర్ణకుమారి, సుజాత, సరస్వతి, లావణ్య పాల్గొన్నారు.

**ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..**

**పాల్వంచరూరల్:** మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామ పంచాయతీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష అభివృద్ధికి కృషి చేసిన గిడుగు వెంకటరామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు శాఖ విభాగాధిపతి కార్తీక్ మాట్లాడారు. మారుతున్న కాలంలో తెలుగు భాషను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ జె.అబ్రహం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎస్.స్వరూపారాణి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.వనజ, డాక్టర్ టి.అరుణకుమారి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఇల్లెందు జీడీసీలో..**

**ఇల్లెందురూరల్:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ మాట్లాడుతూ.. ప్రపంచ భాషలలో తెలుగు ఎంతో మధురమైనదని తెలిపారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ బిందుశ్రీ, డాక్టర్ సీహెచ్ రమేశ్, కిరణ్‌కుమార్, శేఖర్, రాజు, ఇంద్రాణి, సురేంద్రకుమార్, ఈశ్వర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# సామర్థ్యాల సాధనకు కృషి చేయండి

సమీక్షలో ఐటీడీఏ డీడీ మణెమ్మ


మాట్లాడుతున్న ఐటీడీఏ డీడీ మణెమ్మ

**ఇల్లెందురూరల్:** విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐటీడీఏ డీడీ మణెమ్మ సూచించారు. మండలంలోని ఐటీడబ్ల్యూఓ కార్యాలయంలో గిరిజన సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వసతి గృహాల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెంచాలని, వారు పాఠశాలల్లో నూరు శాతం హాజరయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సంక్షేమ శాఖ ద్వారా సరఫరా అవుతున్న వసతి సౌకర్యాలను విద్యార్థులకు అందించాలన్నారు. ప్రతి విద్యార్థి డ్రాప్ అవుట్ కాకుండా చర్యలు తీసుకోవాలని, దీనికోసం ప్రత్యేక రిజిష్టర్ నిర్వహించాలని చెప్పారు. సంక్షేమ పాఠశాలల్లో సూపర్‌వైజర్లు, స్టడీ అవర్‌లలో అలాట్‌మెంట్ ప్రకారం ఉపాధ్యాయులు హాజరుకావాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలో టైంటేబుల్ ప్రకారం ఉపాధ్యాయులు హాజరుకావాలని స్పష్టం చేశారు. వసతి గృహాలు, గురుకులాల్లో మెనూ, శుభ్రత, ఆరోగ్యంపై హెచ్ఎంలు, వార్డెన్లు నిరంతరం పర్యవేక్షించాలని, 21 రిజిష్టర్లు విధిగా నిర్వహించాలని పేర్కొన్నారు. పాఠశాలలకు విద్యార్థులు గైర్హాజరైతే చర్యలు తప్పవని డీడీ హెచ్చరించారు. సమావేశంలో ఏటీడబ్ల్యూఓ రూపాదేవి, ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు పాల్గొన్నారు.

# అందరం కలిసి పనిచేద్దాం..

బీఆర్ఎస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి మదన్‌లాల్


మాట్లాడుతున్న మదన్‌లాల్

**జూలూరుపాడు:** బీఆర్ఎస్‌ను మూడోసారి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా అందరం కలిసికట్టుగా పనిచేద్దామని బీఆర్ఎస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ తెలిపారు. సీఎం కేసీఆర్ అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత తొలిసారి ఆయన మంగళవారం జూలూరుపాడుకు రాగా ప్రజాప్రతినిధులు, నాయకులు స్వాగతం పలికారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో మదన్‌లాల్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాములునాయక్‌తో కలిసి ప్రయాణిస్తున్న నాయకులు, కార్యకర్తలందరికీ సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. త్వరలో ఎన్నికలు జరగనున్నందున బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ భూక్యా కళావతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీశ్‌కుమార్‌తో పాటు నాయకులు, ప్రజాప్రతినిధులు యల్లంకి సత్యనారాయణ, పోలుదాసు గోపాలకృష్ణమూర్తి, రోకటి సురేశ్, పెండ్యాల రాజశేఖర్, చావా వెంకటరామారావు, మూడ్ చిట్టిబాబు, దుద్దుకూరి నాగేశ్వరరావు, బాదావత్ బాలాజీ, సాయిన్ని లక్ష్మణ్‌రావు, శ్రీనివాసరావు, నల్లపాటి రామారావు, చాపలమడుగు రామ్మూర్తి, భూక్యా రాములు, ముక్తి నరసింహారావు, బోడా భోజ్యానాయక్ పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో సత్తా చాటాలి


పాల్వంచరూరల్: విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎస్ఐ కార్తీక్


సూపర్‌బజార్ (కొత్తగూడెం): క్రీడాకారులతో ప్రిన్సిపాల్ శారద, పీడీ సావిత్రి తదితరులు

**పాల్వంచరూరల్:** క్రీడాపాఠశాల విద్యార్థులు చదువుతో పాటు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలని రూరల్ ఎస్ఐ కార్తీక్ అన్నారు. మండలంలోని కిన్నెరసాని గిరిజన ఆశ్రమ క్రీడా పాఠశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులతో 2కే రన్ పోటీ నిర్వహించారు. విజేతలకు ఎస్ఐ బహుమతులు అందించి మాట్లాడారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ క్రీడాదినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని, దీనిని క్రీడా పాఠశాలలో నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం చందు, వ్యాయామ ఉపాధ్యాయులు డాక్టర్ వీరూనాయక్, శంకర్, పి.వెంకటేశ్వర్లు, రాంబాబు, నాగరాజు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

**మహిళా కళాశాలలో క్రీడాదినోత్సవం**

**సూపర్‌బజార్(కొత్తగూడెం):** సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం స్పోర్ట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శారద మాట్లాడుతూ.. విద్యార్థుల ఎదుగుదలకు క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సావిత్రి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# పీహెచ్‌సీని పరిశీలించిన ప్రొఫెసర్


పీహెచ్‌సీ వైద్యాధికారి, సిబ్బందితో ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు

**టేకులపల్లి:** మండలంలోని సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ మోకాళ్ల వెంకటేశ్వరరావు తన బృందంతో కలిసి మంగళవారం సందర్శించారు. ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు క్షేత్రస్థాయిలో అభ్యసించడానికి సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న వసతులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రసూతి గది, వార్డు, జనరల్ వార్డు, ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ కందుల దినేశ్, హౌస్ సర్జన్ డాక్టర్ అనూషతోపాటు అమ్మని లక్ష్మీబాయి, కృష్ణవేణి, సీతమ్మ, పార్వతి, సునీత, వీసం శకుంతల, కిరణ్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## అటెన్షన్ ప్లీజ్

# ప్రమాదకరంగా ఎయిర్ వాల్వ్



మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ ఎయిర్‌వాల్వ్ ప్రమాదకరంగా మారింది. మండలంలోని కేశవాపురం గ్రామం వద్ద బీసీయం జాతీయ రహదారి పక్కన ఉన్న మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ ఎయిర్‌వాల్వ్ దిమ్మెను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇరిగిపోయింది. దానికి మరమ్మతులు చేయకపోతే పైపులైన్‌లోని తాగునీరు బయటకు పోయే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులకు అనేకమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎయిర్‌వాల్వ్ పూర్తిగా పగిలిపోక ముందే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : మల్లికార్జున్, మిషన్ భగీరథ (గ్రిడ్) ఏఈ

సెల్ నంబర్ : 79956 60564

–పాల్వంచరూరల్